నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం | 22 జూన్ 2025
హైదరాబాద్ | www.ntnews.com
13

**ఎక్కడికి వెళ్లాలి? ఎప్పుడు వెళ్లాలి? ఎలా వెళ్లాలి? ఈ ప్రశ్నల కన్నా.. ఇప్పుడు 'ఎవరితో వెళ్లాలి?' అన్నదే చాలా ఇంపార్టెంట్‌గా మారిపోయింది. రొటీన్ టూర్లు ఫ్రెండ్స్‌తోనో, పార్ట్‌నర్‌తోనో, ఫ్యామిలీతోనో సాగిపోతుంటాయి. కానీ, ఇప్పుడు ట్రెండ్ మారిపోతున్నది బాస్.. ఇప్పుడో కొత్త కాంబినేషన్ సెట్ అవుతున్నది. అదే 'ఫ్రోలీగ్స్'తో టూర్స్!! ఎవరీ 'ఫ్రోలీగ్స్' అనుకుంటున్నారా? వీళ్లు ఫారినర్స్ కాదు, ఐపీఎల్ చీర్‌గర్ల్స్ అంతకన్నా కాదు. ఫ్రెండ్స్‌లా ఫీల్ అయ్యే కొలీగ్స్. వీళ్లనే నేటి జెన్-జీ బ్యాచ్ అంతా 'ఫ్రోలీగ్స్' అని పిలుచుకుంటున్నారు!! ఇప్పుడు వీళ్ల తో ట్రావెల్ ప్లాన్స్ ట్రెండింగ్‌గా నిలుస్తున్నాయి.**

# ఫ్రోలీగ్స్ టూర్స్
## మీరూ వెళ్లిపోతారా?

ఆఫీస్‌లో కాఫీ టేబుల్ కబుర్లు.. అక్కడినుంచి అలా వీకెండ్ వెకేషన్‌కి వెళ్తున్నాయి. అంతేనా.. లాంగ్ జర్నీ టూర్స్‌కి కూడా ప్రణాళికలు పడుతున్నాయి. ఇది ఎంతవరకూ వచ్చిందంటే.. వర్క్ వైవ్స్, వర్క్ హస్బెండ్స్ విడివిడిగా ప్లాన్ చేస్తున్నారట. అంటే.. నేటి కార్పొరేట్ ఆఫీస్‌లో పనిచేసే ఆడవాళ్లంతా కలిసి ట్రిప్స్‌కి వెళ్లేందుకు ఇష్టపడుతున్నారట. పురుషులూ మేం కూడా ఎక్కడా తగ్గేదే లేదంటూ బెస్ట్ ఫ్రోలీగ్స్‌గా యాత్రలకు వెళ్తున్నారు. స్త్రీ, పురుషులు కలివిడిగానూ విహారానికి సై అంటున్నారు. ఇంకేముందీ.. ఆఫీస్ క్యూబికల్‌లో పడే జోక్స్ ఏకంగా ట్రెక్కింగ్, బీచ్ ట్రిప్స్‌లో పేలుతున్నాయి. ట్రావెల్ అంటే ఒకప్పుడు ఫ్రెండ్స్‌తో వెళ్లడం.. బీచ్‌లు, కొండలు చూసి రావడం పాత స్టయిల్‌గా మారిపోయింది. ఎక్కువగా ట్రావెల్ చేయడం, ఎక్కువ ఖర్చు చేయడం, మినీ వెకేషన్స్‌తోపాటు లాంగ్ లగ్జరీ ట్రిప్స్‌కు వెళ్లడం.. అదీ ఫ్రోలీగ్స్‌తో ఫాలో అవుతున్న ట్రెండ్. ఒక సర్వే ప్రకారం ఎక్కువ శాతం మంది 'ఫ్రోలీగ్స్'తో ట్రావెల్ చేయడానికి ఇష్టపడుతున్నారు. ఆఫీస్‌లో కాఫీ బ్రేక్ తీసుకునే బెస్టీ ఇప్పుడు ట్రెక్కింగ్ పార్ట్‌నర్ అవుతున్నారు.. ఇది 2025 ట్రావెల్ మాయ!

### కల్చర్ మారుతున్నది

నేటి తరం ఏం చేసినా.. కెరీర్ ఫోకస్‌గా ప్లాన్ చేస్తున్నది. తక్కువ వయసులోనే ఉన్నత శిఖరాల్ని అందుకునేందుకు కష్టపడుతున్నది. అందుకేనేమో ప్రోగ్రెసివ్‌గా ఈ ఫ్రోలీగ్స్ ట్రెండ్ ముందుకొస్తున్నది. ఇంటినుంచి తెచ్చుకున్న లంచ్ బాక్స్ దగ్గర్నుంచి కెఫెటేరియాలో కాఫీ వరకూ అన్నీ ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆఫీస్ బెస్టీలు, వర్క్ వైవ్స్ (భార్యలు), వర్క్ హస్బెండ్స్ (భర్తలు) లాంటి వాళ్లపై థామస్ కుక్ ఓ సర్వే చేసింది. దీంట్లో 2,500 మంది పాల్గొన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా కూడా డేటా కలెక్ట్ చేశారు. ఈ సర్వే ప్రకారం.. దేశంలో ట్రావెల్ ట్రెండ్స్ మారుతున్నాయి. ఫ్యామిలీ కల్చర్స్, వర్క్ కల్చర్స్ ఆధారంగా సరికొత్త ట్రావెల్ ఫ్రెండ్స్ పుట్టుకొస్తున్నారు. ఇక భారతీయ పర్యాటకులు ట్రెడిషనల్ సైటుసీయింగ్ కంటే ఎమోషనల్, ఎక్స్‌పీరియెన్షియల్ ట్రావెల్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని థామస్ కుక్ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు.

### విహార యాత్రలంటే..

చక్కగా రెడీ అవ్వడం.. ఏ బస్సు విండో నుంచో.. హోటల్ గది కిటికీ నుంచో.. ప్రకృతిని చూస్తూ కూర్చోవడం నేటి తరం ఇష్టపడటం లేదు. నేటి జెన్-జీ బ్యాచ్ అంతా 'ఎక్స్‌పీరియెన్షియల్ ట్రావెల్'నే ఇష్టపడుతున్నారు. 2025లో ఈ ఎక్స్‌పీరియెన్షియల్ ట్రావెల్ డిమాండ్ 75 శాతానికి చేరింది. అంటే, సాధారణ టూరిస్ట్ స్పాట్స్ కంటే ప్రత్యేక అనుభవాలు, ఈవెంట్-బేస్డ్ ట్రావెల్‌కు ఇంపార్టెన్స్ పెరిగింది. అంటే.. ఎప్పుడూ చూడని వాటిని సాహసం చేసైనా చూడటం.. ట్రెక్కింగ్ చేయడం.. లాంటివి అన్నమాట.

### కొత్త డెస్టినేషన్స్ కోసం..

నేటి డిజిటల్ ఎరాలో సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్స్, ఏఐ ట్రావెల్ ప్లానింగ్‌కు కీలకంగా మారాయి. ఓ సర్వే ప్రకారం.. 60% మంది యూత్ సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్స్, మూవీస్ చూసి ట్రావెల్ డెస్టినేషన్స్ సెలెక్ట్ చేస్తున్నారట. ఎందుకంటే.. ఇప్పుడు ప్రపంచ సినిమా మొత్తం ఓటీటీలపైకి వచ్చేసింది. దీంతో ఆయా సినిమాల్లోని లొకేషన్స్, కల్చర్స్, ఆహారపు అలవాట్లు కొత్త ప్రాంతాల్ని ఎక్స్‌ప్లోర్ చేసేందుకు సోర్స్ అవుతున్నాయి. ఏ చిన్న టైమ్ గ్యాప్ దొరికినా ట్రావెల్ చేసేందుకు మక్కువ చూపుతున్నారు. అంతే కాదు.. 84% మంది ఖర్చుకు వెనకాడేదే లేదని చెబుతున్నారట. మరో వైపు మినీ వెకేషన్స్, లాంగ్ ట్రిప్స్ రెండూ ట్రెండ్ అవుతున్నాయి. లాంగ్ వీకెండ్స్, పబ్లిక్ హాలిడేస్‌ను వాడుకుని రిలాక్స్ అవ్వాలని చూస్తున్నారు.

### రిలాక్స్ బేబీ

**ఎవరైనా** టూర్లకు ఎందుకు వెళ్తారు.. అక్కడున్న విశేషాల్ని ఎక్స్‌ప్లోర్ చేయడానికే కదా. కానీ, మీకు తెలుసా? బోలెడన్ని డబ్బులు ఖర్చుపెట్టి.. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి.. లగ్జరీ హోటల్ రూమ్‌లు తీసుకుని.. సింపుల్‌గా ఏమీ చేయకుండా ఆ గదుల్లోనే గంటల తరబడి నిద్రపోతారు. ఇప్పుడు ఇదో నయా ట్రావెల్ ట్రెండ్. ఫ్రోలీగ్స్ ఫాలో అవుతున్న నయా జీవన విధానం ఇది. దీనికో పేరు కూడా ఉంది. 'హర్కుల్ డర్కలింగ్' (Hurkle Durkling). ఇది ఓ స్కాటిష్ పదం నుంచి పుట్టింది. దీని అర్థం ఏంటంటే.. ఏమీ చేయకుండా మంచంపై గంటలు కొద్దీ పడుకుని, కూర్చుని రిలాక్స్ అవ్వడం. అంటే ఎక్కడికైనా టూరిస్ట్ స్పాట్‌కి వెళ్తారు.. అక్కడే గదిలోనే ఉంటారు. స్లీప్ థెరపీస్, మసాజ్, స్పా ట్రీట్‌మెంట్స్‌తో మానసికంగా రిలాక్స్ అవుతారు. ఫ్రోలీగ్స్ దృష్టిలో ఇది టూర్ కాదు. ఇదో 'రీ చార్జ్' అన్నమాట. స్ట్రెస్‌ఫుల్ జీవనం నుంచి తీసుకునే బ్రేక్. ఒక రిపోర్ట్ ప్రకారం.. ప్రతి ఐదుగురిలో ఒకరు ఈ రకమైన టూర్ కోసం చూస్తున్నారట.

### ఎంజాయ్ చేసేద్దాం

**నేటి** తరం రోజులో ఎక్కువ సమయం ఆఫీస్‌లో, కొలీగ్స్‌తోనే గడిపేయడం చూస్తున్నాం. ఫ్యామిలీ, బెస్ట్ బడ్డీస్ కంటే కూడా! అందుకే సహజంగానే మన కొలీగ్స్‌తో ఒక బాండ్ క్రియేట్ అవుతుంది. ఫ్రెండ్‌షిప్‌ను పెంచుతుంది. అందుకే వీరిని 'ఫ్రోలీగ్స్' అని పిలుచుకుంటూ ఆఫీస్ టైమ్ దాటి.. హ్యాంగ్ అవుట్ చేయడం.. షార్ట్ ట్రిప్స్‌కు వెళ్లడం లాంటివి చేస్తున్నారు. 'ఫ్రోలీగ్స్'తో ట్రిప్స్ అంటే అన్నీ స్మూత్‌గా ఉంటాయని కాదు.. కొన్ని చాలెంజెస్ కూడా ఉంటాయి. వర్క్ బడ్డీస్‌తో ట్రావెల్ చేస్తుంటే వర్క్ టాపిక్స్ నుంచి డిస్‌కనెక్ట్ అవ్వడం కష్టం! ఇది కొన్నిసార్లు ఇబ్బందికరంగా మారొచ్చు. అందుకే ఈ టూర్‌లో జాయ్‌నెస్ తగ్గకూడదు అనుకుంటే ఈ చిట్కాలు ఫాలో అవ్వండి..

- హాయిగా, తక్కువ ట్రావెల్ టైమ్‌లో చేరుకునేలా సిటీ శివార్లలో ఒక డెస్టినేషన్ లాక్ చేయండి. ఇది సమయాన్ని ఆదా చేస్తుంది.
- లొకేషన్ గురించి బేసిక్ రీసెర్చ్ చేయండి. ఏం ఎక్స్‌ప్లోర్ చేయొచ్చు.. ఎలాంటి ఫన్ యాక్టివిటీస్ ఉన్నాయి.. రివ్యూస్ చదివి ఒక అంచనాకు రండి.

- కొన్ని టీమ్-బిల్డింగ్ యాక్టివిటీస్, చాలెంజింగ్ టాస్క్‌లను లిస్ట్ చేయండి. ఇవి మీ ఫ్రోలీగ్స్ గురించి మరింత తెలుసుకోవడానికి హెల్ప్ చేస్తాయి.
- టూర్ ఆర్గనైజర్ లేదా ఏదైనా యాక్టివిటీ కోసం ఎక్స్‌పర్ట్ సహాయం తీసుకుంటే మరీ మంచిది.
- అందరికీ సరిపడే బడ్జెట్ డిసైడ్ చేసుకోండి. అది ట్రిప్ స్మూత్‌గా సాగడానికి సహకరిస్తుంది.
- 'ఫ్రోలీగ్స్'తో ట్రిప్స్ కేవలం రిలాక్సేషన్ కోసమే కాదు. ఆఫీస్ బడ్డీస్‌తో మరింత క్లోజ్‌గా ఉండే అవకాశం. టీమ్‌తో బాండ్‌ను మరింత పెంచుతుంది. కొత్త అనుభవాలను ఇస్తాయి.

# ఆమె.. అద్భుతమైన వ్యక్తి!

**బాలీవుడ్** సీనియర్ నటి జుహీచావ్లాను ఆకాశానికి ఎత్తేస్తున్నది మధుబాల. 'ఆమె ఓ అద్భుతమైన వ్యక్తి!' అంటూ తెగ పొగిడేస్తున్నది. దగ్గరి బంధువులైన ఈ సీనియర్ హీరోయిన్లు ఇద్దరూ.. సినిమా ఫంక్షన్లలోనే కాదు, ఫ్యామిలీ మీటింగ్స్‌లోనూ తరచుగా కలుస్తుంటారు. ఈ క్రమంలో.. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జుహీచావ్లాతో తన కున్న అనుబంధం గురించి పంచుకున్నది మధుబాల. ''కొన్నేళ్లుగా జూహీని దగ్గరినుంచి చూస్తున్నా! ఆమె ఎంతో సాఫ్ట్! ఇన్నేళ్లలో ఆమె నోటినుంచి ఒక్క నెగెటివ్ మాట రావడం నేనెప్పుడూ వినలేదు'' అంటూ చెప్పుకొచ్చింది. ''కుటుంబ సభ్యులతోనేకాదు.. సినిమాలు, షూటింగ్స్ లాంటి విషయాల్లోనూ జూహీ ఎప్పుడూ దయతోనే మెదులుతుంది. ఎలాంటి సందర్భంలోనైనా ఎంతో సంయమనాన్ని పాటిస్తుంది'' అంటూ మెచ్చుకుంది. సాధారణ సంభాషణల్లోనూ విమర్శలకు దూరంగా ఉండే ఇలాంటి వ్యక్తిని కలవడం.. చాలా అరుదంటూ జుహీని ఆకాశానికి ఎత్తేసింది. ఇక జూహీచావ్లాలో దాగి ఉన్న చిత్రనిర్మాణ నైపుణ్యాల గురించీ మాట్లాడుతూ.. ''ఆమె ఎంతో అంకితభావంతో పనిచేస్తుంది. ప్రేక్షకుల నుంచి విమర్శలు ఎదురైనా.. వాటిని మనస్ఫూర్తిగా స్వీకరిస్తుంది'' అంటూ కొనియాడింది. అందం.. అంతకుమించిన అభినయంతో 90లలో టాప్‌హీరోయిన్‌గా వెలిగింది మధుబాల. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'రోజా'తో తెరకు పరిచయమైంది. తొలి చిత్రంతోనే నాటి కుర్రకారు గుండెలను కొల్లగొట్టింది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడతోపాటు హిందీలోనూ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించింది. అయితే, కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే.. పెళ్లి పీటలెక్కింది. బాలీవుడ్ అగ్రతారలు హేమా మాలిని, జుహీ చావ్లాకు దగ్గరి బంధువైన వ్యాపారవేత్త ఆనంద్ షాను వివాహం చేసుకుంది. పెళ్లి, పిల్లల తర్వాత సినిమాలకు దూరమైన మధుబాల.. మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. అంతకుముందు ఆ తర్వాత, సూర్య వర్సెస్ సూర్య, ప్రేమదేశం, ఈగల్, శాకుంతలం తదితర సినిమాల్లో మంచి పాత్రలతో మెరిసింది. ప్రస్తుతం మంచు విష్ణు ప్రధాన పాత్రలో వస్తున్న భారీ చిత్రం.. 'కన్నప్ప'లోనూ కీలకపాత్రలో కనిపించనున్నది మధుబాల.

# వార్ ఫర్ ఫ్యామిలీ!

**రానా నాయుడు-2**

ఓటీటీ హిట్

**నెట్‌ఫ్లిక్స్ :** స్ట్రీమింగ్ అవుతున్నది
**తారాగణం:** విక్టరీ వెంకటేష్, రానా, సుర్వీన్ చావ్లా, రాహుల్ పోహ్రా, కృతి ఖర్బందా, అర్జున్ రామ్‌పాల్, అభిషేక్ బెనర్జీ, సుశాంత్ సింగ్ తదితరులు.
**దర్శకత్వం:** సుప్రాణ్ ఎస్ శర్మ, అభయ్ చోప్రా

**భారతీయులు** కుటుంబానికి అధిక ప్రాధాన్యమిస్తారు. ఉద్యోగం, వ్యాపారం కన్నా.. ఫ్యామిలీ కోసమే ఎక్కువగా కష్టపడుతుంటారు. కుటుంబం బాగుండాలని ఎన్ని బాధలైనా ఓర్చుకుంటారు. అవసరమైతే ప్రాణాలకు కూడా తెగిస్తారు. అలా, తన కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం యుద్ధానికైనా సిద్ధపడే తండ్రీకొడుకుల కథే.. రానా నాయుడు-2. బోల్డ్ కంటెంట్.. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా 2023లో 'నెట్‌ఫ్లిక్స్'లో సందడి చేసింది రానా నాయుడు మొదటి సీజన్. దానికి కొనసాగింపుగా వచ్చిందే.. రానా నాయుడు-2. మొత్తం ఎనిమిది ఎపిసోడ్లుగా వచ్చిన ఈ సిరీస్.. ఆద్యంతం ఆకట్టుకునేలా సాగుతుంది.
కథలోకి వెళ్తే.. రానా నాయుడు (రానా) ముంబైలోని సెలెబ్రిటీలు, ధనవంతుల కోసం పనిచేస్తుంటాడు. వారికి వచ్చిన కష్టాల్ని, నష్టాల్ని ఫిక్స్ చేస్తుంటాడు. అయితే.. ఈసారి మాత్రం తన ఫ్యామిలీని ఫిక్స్ చేయాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం తాను పనిచేస్తున్న ఓబీ మహాజన్ (రాజేశ్ జైష్) దగ్గరినుంచి

బయటికి వచ్చేయాలని అనుకుంటాడు. కుటుంబంతో సంతోషంగా గడపాలని ఫిక్స్ అవుతాడు. అంతలోనే ముంబైకి చెందిన పేరుమోసిన గ్యాంగ్‌స్టర్ రౌఫ్ మీర్జా (అర్జున్ రామ్‌పాల్) తమ్ముడు సైఫ్.. రానా కొడుకుని కిడ్నాప్ చేస్తాడు. అలాంటి అత్యవసర సమయంలో బిజినెస్ మ్యాగ్నెట్ విరజ్ ఒబెరాయ్ (రాహుల్ పోహ్రా).. రానాకు సాయం చేస్తాడు. కానీ, బదులుగా తనకు ఓ పని చేసిపెట్టాలని షరతు విధిస్తాడు. రానాను మళ్లీ.. తాను వదిలెయ్యాలి అనుకునే ఉచ్చులోకే లాగుతాడు. చేసేది లేక కొడుకు కోసం చివరి పనిగా బరిలోకి దిగుతాడు రానా. ఈ క్రమంలో రానాకు ఎదురైన సవాళ్లు ఏంటి? తనను దెబ్బతీసేందుకు ఒబెరాయ్ కుటుంబం వేసే ఎత్తులు, పైఎత్తుల్లోంచి రానా ఎలా బయటపడతాడు? ఇందులో రానా కుటుంబానికి వచ్చే కష్టాలు ఏంటి? నాగా నాయుడు (వెంకటేష్).. తన కుటుంబానికి ఎలా అండగా నిలబడతాడు? చివరికి రానా తన కుటుంబాన్ని కాపాడుకున్నాడా లేదా? తన పాత్ర ఎలా ముగుస్తుంది? అనేది తెలియాలంటే 'రానా నాయుడు-2' చూడాల్సిందే!

# అసుపత్రిలో కెప్టెన్ జాక్!

**కెప్టెన్** జాక్‌స్పారో.. ఇప్పటివాళ్లకు అంతగా తెలియకపోవచ్చు. కానీ, రెండు దశాబ్దాల క్రితం.. ఒకతరం సినీ ప్రేక్షకులు అమితంగా అభిమానించిన పేరు. 2003లో మొదలైన 'పైరేట్స్ ఆఫ్ ద కరేబియన్' ఫ్రాంచైజీతో.. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న కథానాయకుడు జాక్‌స్పారో! ఈ పాత్ర పోషించింది హాలీవుడ్ నటుడు జానీ డెప్. ఒక్క క్యారెక్టర్‌తోనే హాలీవుడ్ సూపర్ స్టార్లలో ఒకడుగా నిలిచిపోయాడు. 2017లో వచ్చిన ఈ ఫ్రాంచైజీలోని చివరిచిత్రం 'డెడ్‌మెన్ టెల్ నో టేల్స్'లో చివరిసారిగా కెప్టెన్ జాక్‌స్పారోగా కనిపించాడు జానీ. మళ్లీ ఇన్నాళ్లకు ఆ ఐకానిక్ పాత్రలో మెరిశాడు. అయితే.. ఇప్పుడు కెప్టెన్ జాక్‌గా మారింది సినిమా కోసం కాదు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పలకరించడానికి ఈ అవతారం ఎత్తాడు. ప్రస్తుతం తన కొత్త ప్రాజెక్ట్ 'డే డ్రింకర్' చిత్రీకరణ కోసం స్పెయిన్‌లో ఉన్నాడు ఈ హాలీవుడ్ హీరో. ఈ సందర్భంగా మాడ్రిడ్‌లోని 'నినో జీసస్ యూనివర్సిటీ చిల్డ్రన్స్ హాస్పిటల్'ను కెప్టెన్ జాక్‌స్పారో పాత్రలో సందర్శించి.. అక్కడి పిల్లలను ఆశ్చర్యపరిచాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇలా పిల్లల ఆనందం కోసం పనిచేయడం, వారికోసం విలువైన సమయాన్ని కేటాయించినందుకు జానీపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు. ఎలాంటి ప్రచారం కోరుకోని 'నిజమైన హీరో' అంటూ కొనియాడుతున్నారు. అయితే.. జానీడెప్ ఇలా జాక్‌స్పారోగా పిల్లల ఆసుపత్రిని సందర్శించడం ఇదే మొదటిసారి కాదు. 2024లోనూ శాన్ సెబాస్టియన్ (స్పెయిన్)లోని డోనోస్టియా యూనివర్సిటీ ఆసుపత్రినీ ఇలాగే సందర్శించాడు. అక్కడి పిల్లలను పరామర్శించాడు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నాడు. అంతకుముందు కూడా.. వాంకూవర్, పారిస్, లండన్, బ్రిస్బేన్ తోపాటు అమెరికాలోని అనేక నగరాల్లో ఉన్న దవాఖానలనూ సందర్శించాడు.

# అది నా సినిమా!

**రామ్-జెనీలియా** జంటగా 2008లో వచ్చిన 'రెడీ'.. బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. కామెడీ, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా.. ఏమాత్రం అంచనాలు లేకుండానే వచ్చి, బాక్సాఫీస్‌ను బద్దలుకొట్టింది. ఇందులో జెనీలియా.. 'పూజ' పాత్రలో చక్కగా ఒదిగిపోయింది. దక్షిణాదిలో ఘనవిజయం సాధించిన రెడీ చిత్రం.. అదేపేరుతో బాలీవుడ్‌లో రీమేక్ అయ్యింది. అందులో సల్మాన్ ఖాన్ హీరో కాగా, 'పూజ' పాత్రను సీనియర్ నటి అసిన్ పోషించింది. అప్పటికే బాలీవుడ్‌లో కొన్ని సినిమాలు చేసిన జెనీలియా.. రెడీ హిందీ రీమేక్‌లో నటించక పోవడంపై తాజాగా స్పందించింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 'రెడీ' సినిమాల సంగతులను పంచుకున్నది. ''దక్షిణాదిలోనే కాదు.. హిందీలోనూ 'రెడీ' చిత్రం ఘనవిజయం సాధించింది. తెలుగులో నా పాత్రకు మంచి పేరొచ్చింది. హిందీలోనూ చేద్దామనుకున్నా! కానీ, దర్శకనిర్మాతలు నన్ను సంప్రదించలేదు. అయినా.. అది నా సినిమా! దక్షిణాదిలో నన్ను స్టార్ హీరోయిన్‌గా నిలబెట్టిన సినిమా. అందుకే, బాలీవుడ్‌లో అవకాశం రాకపోయినా నాకు బాధగా అనిపించలేదు'' అని చెప్పుకొచ్చింది. ఇక సల్మాన్ ఖాన్‌లాంటి అగ్రనటుడి సరసన నటించే అవకాశం చేజారడంపైనా జెనీలియా స్పందించింది. ''ఏమో.. సల్మాన్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి వేరే ఏదైనా సినిమా 'రెడీ'గా ఉందేమో!'' అంటూ చెప్పింది. తెలుగులో 'రెడీ' మొత్తం నవ్వుల జల్లులా సాగుతుంది. బాలీవుడ్‌లో రీమేక్ అయినప్పుడు.. హంగులు, ఆర్భాటాలతోపాటు మరిన్ని మసాలా వైబ్స్ జతకలిశాయి. 2011లో విడుదలైన హిందీ వెర్షన్.. పండుగ సీజన్ కాకపోయినా, మంచి వసూళ్లు రాబట్టింది. ఇక జెనీలియా సినిమాల విషయానికి వస్తే.. 2003లో శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'బాయ్స్'తో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. అదే ఏడాది వచ్చిన 'సత్యం'తో టాలీవుడ్‌కు మరింత దగ్గరైంది. రామ్‌చరణ్, ఎన్టీఆర్, వెంకటేశ్, అల్లు అర్జున్, నితిన్, రానా వంటి స్టార్ హీరోల సరసన నటించింది. తాజాగా.. బాలీవుడ్ అగ్రనటుడు ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'సితారే జమీన్‌పర్'లో కథానాయికగా నటించింది.

# గ్లిజరిన్‌తో నిగారింపు

**సినిమాల్లో** నటీనటుల కన్నుల వెంట నీళ్లు తెప్పించే గ్లిజరిన్‌ను సబ్బుల్లోనూ, మాయిశ్చరైజర్లలోనూ ఉపయోగిస్తారు. దీన్ని పద్ధతిగా ఉపయోగిస్తే.. చర్మం మెరిసిపోతుంది.

- జిడ్డు చర్మతత్వం ఉన్నవాళ్లు గ్లిజరిన్‌తో తడిపిన దూదితో రోజూ ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మొటిమలు మాయమవుతాయి. యాక్నెలాంటి సమస్యలూ దూరమవుతాయి.
- ముల్తానీ మట్టిలో చెంచా గ్లిజరిన్, కొన్ని నీళ్లు కలిపి మెత్తటి మిశ్రమంలా చేసుకోవాలి. దాన్ని ముఖానికి రాసుకుని ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. తరవాత చన్నీళ్లతో కడిగేసుకుంటే ముఖంపై పేరుకున్న మురికి తొలగిపోయి, చర్మం తాజాగా మారుతుంది.



- స్నానం చేసే నీళ్లలో లేదా చర్మ సంరక్షణకు వాడే క్రీములూ, క్లెన్సర్లలో కొంచెం గ్లిజరిన్‌ని కలిపి వాడుకోవచ్చు. దీనివల్ల చర్మం పొడిబారదు, నిగారింపు కోల్పోదు. చర్మం మృదువుగా మారుతుంది కూడా.
- చర్మం పొడిబారే సమస్య ఉన్నవారు రాత్రి పూట కప్పు నీళ్లలో చెంచా గ్లిజరిన్ కలిపి ముఖానికి రాసుకుని ఉదయాన్నే శుభ్రపరుచుకుంటే సరి. చర్మం నునుపుగా మారుతుంది.